క్లుప్తంగా

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ప్రసాదపాత్రుడు

మాడుగుల రూరల్: కె.జె.పురం పీహెచ్‌సీలో శనివారం క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కె.జె.పురం, కింతలి, వడ్డాది, కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలోని 68 మందికి కందిపప్పు, బెల్లం, గోధుమ పిండి, ఆయిల్‌ప్యాకెటు, రాగిపిండి, వేరుశనగ, కొమ్ము శనగలు, కందిపప్పు, పెసరపప్పులతో కూడిన కిట్లను కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్. ప్రసాదుపాత్రుడు పంపిణీ చేశారు. టి.బి. సూపర్‌వైజరు ఈశ్వరరావు, సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ, ఎంపీహెచ్‌ఈవో పి. రామారావు, హెచ్‌వీ పుష్పకాంతం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నర్సీపట్నం: అఖిల భారత రెడ్ల కుల గురువు కుంటి మల్లారెడ్డి సేవ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పేట్లా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎస్.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్.వీర్రాజ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగేశ్వరరెడ్డి, కోశాధికారిగా జి.మారురెడ్డి, సహాయ కార్యదర్శులుగా పి.శివరెడ్డి, ఎస్.సతీష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రాజురెడ్డి, రవిరెడ్డి, చెన్నారెడ్డి, దుర్గారెడ్డి, సతీష్‌రెడ్డి, నాగేష్‌రెడ్డి, అప్పలనాయుడురెడ్డి, తాతాజీ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు.

గ్రంథాలయ చైర్మన్‌కు ఎమ్మెల్యే గణేష్ సన్మానం



స్టేట్ చైర్మన్ శేషగిరిరావు, చైర్‌పర్సన్ రమాదేవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణానికి విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, వైఎస్సార్‌సీపీ అధికారి ప్రతినిధి రాజీవ్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సన్మానించారు. మున్సిపాలిటీ నుంచి గ్రంథాలయానికి చెల్లించాల్సిన సెస్ విషయంలో చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. గ్రంథాలయాలను డిజిటలైజేషన్ వైపు నడిపిస్తున్న చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులపై దాడి ఘటనలో ఇద్దరు అరెస్టు



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ గణేష్, ఎస్సై సుధాకర్

నర్సీపట్నం: ఎస్సీ కళాశాల వసతి గృహం విద్యార్థులపై దాడికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ ఎన్. గణేష్ తెలిపారు. నర్సీపట్నం శారదానగర్‌కు చెందిన భీమిరెడ్డి హర్షవర్ధన్, బీసీ కాలనీకి చెందిన చిటికెల దుష్యంత్ ఈ నెల 3వ తేదీ రాత్రి శివపురంలోని బాలుర వసతి గృహంలోకి చొరబడి విద్యార్థులపై దాడి చేసి గాయపరిచి, నాలుగు సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.

అల్లరి మూకలు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

హాస్టళ్ల వద్ద అల్లరి మూకలు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని టౌన్ సీఐ ఎస్.గణేష్, ఎస్సై సుధాకర్ విద్యార్థులకు సూచించారు. ఎస్సీ వసతి గృహంలో సంఘటన నేపథ్యంలో శనివారం శివపురంలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతిగృహం, బాలుర వసతిగృహంలో వేర్వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వార్డెన్‌కు గానీ పోలీసులకు గానీ సమాచారం అందించాలన్నారు. దిశయాప్ డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. హాస్టల్ వార్డెన్‌కు బీట్ కానిస్టేబుళ్లు అటెండన్స్ రిజిస్టర్ అందజేశారు.

నులిపురుగులను నులిమేద్దాం

- 10న విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ
- డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి



దేవరాపల్లి: వైద్య సిబ్బందికి నులిపురుగుల మాత్రలను అందజేస్తున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి



రోలుగుంట: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి



మాడుగుల: బోచర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వేమవరపు రామధర్మజ



మాకవరపాలెం:మాత్రలు అందజేస్తున్న ఎంపీడీవో, వైద్యాధికారులు

రోలుగుంట: నులి పురుగులు నులిమేద్దాం.. పిల్లలను ఆరోగ్యవంతులను చేద్దాం అని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమంపై వైద్యాధికారి ఎస్.ధనలక్ష్మి శనివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలను 19 ఏళ్లలోపు వారికి మింగించాలన్నారు. వీటిని ఆహారం తిన్న తర్వాత వేసుకోవాలన్నారు. తరువాత విద్యార్థులను పాఠశాల నుంచి బయటకు పంపకుండా పర్యవేక్షణలో ఉంచాలన్నారు. అందుకోసం ప్రతి పాఠశాలకు ఒక సూపర్‌వైజర్‌ను ఏర్పాటు చేశామన్నారు. వారి సూచనలు, సలహాలు పాటించాలన్నారు. దీనికి సంబంధించి గోడపత్రికను విడుదల చేశారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, బుచ్చింపేట పీహెచ్‌సీల వైద్యుడు శ్రీనివాసరాజు, ఎంపీహెచ్‌ఈవోలు సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్: నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా ఈ నెల 10న కేజేపురం పీహెచ్‌సీ పరిధిలో ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నులిపురుగులు నివారణ బోచర్లు ఆవిష్కరించారు. పీహెచ్‌సీ పరిధిలో 32 పాఠశాలలు, రెండు కళాశాలలకు చెందిన ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు 6,500 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారని వైద్యాధికారి ఎల్. ప్రసాదపాత్రుడు తెలిపారు. ఆ రోజు తప్పిపోయిన వారికి ఈ నెల 17న పంపిణీ చేస్తామన్నారు. ఎంపీడీవో పి.ఎస్.ఎల్. మీనాకుమారి, సీహెచ్‌వో సీహెచ్ పుష్పమ్మ, ఆరోగ్య సహాయకుడు పి.శంకర్రావు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పాఠశాలల్లో 5,874 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి సూచించారు. ఈ నెల 10 నుంచి 17 వరకు జరిగే కార్యక్రమంపై వైద్య ఆరోగ్య, విద్యాశాఖ అధికారులు సమన్వయ సమావేశం శనివారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీడీవో వైద్య సిబ్బందికి అందజేశారు. దేవరాపల్లి, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికార్లు ఇ. పూజ్య మేఘన, ఆర్. గోవిందరెడ్డి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డి జి. సంతోషి నళిని, సిహెచ్‌వో పి. ప్రసాదరావు, ఎంఈవో–2 వి. ఉషారాణి పాల్గొన్నారు.

5,470 మందికి అల్బెండజోల్ మాత్రలు

మాకవరపాలెం: మండలంలో 5,470 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు మాకవరపాలెం, బూరుగుపాలెం వైద్యాధికారులు శ్రీవిద్య, చరణ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైద్య సిబ్బందికి డీ వార్మింగ్ డేపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బందికి మాత్రలను అందజేశారు. ఎంపీడీవో అరుణశ్రీ, సిహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌వో జాన్సన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరోజిని పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వం తోడ్పాటు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఉద్యానవన అధికారులు

నర్సీపట్నం: ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న వందశాతం రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శనివారం గురంధరపాలెంలో రైతులకు ఆయిల్ ఫామ్ మొక్కలు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవాల్లో భాగంగా ఆయిల్‌ఫామ్ దోటల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంద శాతం రాయితీపై మొక్కలను అందిస్తున్నాయన్నారు. ఆయిల్‌ఫామ్ తోటల ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ తోటల పెంపకం ఎంతో లాభదాయకం ఉందన్నారు. పతాంజలి కంపెనీ డీజీఎం రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలో 3,517 హెక్టార్లలో 2,976 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది 31,000 టన్నుల ఆయిల్‌పామ్ గెలలను సప్లయి చేశారన్నారు. ఉద్యావనశాఖ అధికారి ఎస్.శిరీష, సర్పంచ్ శానపతి వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు



లింగంపేటలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



బైలపూడిలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: శతశాతం రాయితీపై ప్రభుత్వం ఆయిల్ పామ్ మొక్కలను అందిస్తుందని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. మండలంలోని బైలపూడి, వరహాపురం, చీడికాడ, కోనాం గ్రామాల్లో గుమ్మాల నాగరాజు, పెరునాయుడు, తదితర రైతులకు చెందిన 13.35 ఎకరాల్లో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయిల్‌పామ్ మొక్క నాటి మాట్లాడారు. ప్రభుత్వం దీనికి నాలుగేళ్లపాటు హెక్టారుకు రూ.5,250 ఎరువులకు, రూ.5,250 అంతర పంటల సాగుకు అందిస్తుందన్నారు. 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ అందిస్తుందన్నారు. ఉద్యానవన శాఖ ఫీల్డ్ ఆఫీసర్ బి.నాయుడు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయిప్రసాద్, నాయకులు స్వామినాయుడు, కురచా నారాయణమూర్తి పాల్గొన్నారు.

గొలుగొండ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. లింగంపేటలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటి వద్ద మొక్కలు పెంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

రోడ్లపై మాట్లాడే హక్కు టీడీపీకి లేదు

వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సత్యం, మాజీ ఎంపీపీ భాస్కరరావు, బాబూరావు, నారాయణమ్మ

దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు యజ్ఞంలా రోడ్లు నిర్మిస్తుంటే, టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ శనివారం విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకుల చౌకబారు వ్యాఖ్యలను ఖండించారు. డిప్యూటీ సీఎం చొరవతో రూ. 20 కోట్లతో నిర్మాణంలో ఉన్న బోయిలకింతాడ – కాశీపురం రోడ్డుపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఆ పార్టీ నాయకులు నిరసన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏ ఒక్క రోడ్డు నిర్మించకపోగా, కనీసం గొయ్యిలు సైతం పూడ్చలేదన్నారు. ఇప్పుడు ప్రధాన రహదారులతోపాటు దశాబ్దాలుగా కాలినడకకు సైతం పనిచేయని రోడ్లను కోట్లాది రూపాయలతో బీటీ, సీసీరోడ్లుగా నిర్మిస్తే టీడీపీ నాయకులు కళ్లున్న కబోదులుగా విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారని, వారి తీరును ఆపార్టీ కార్యకర్తలే చీదరించుకుంటున్నారన్నారు. ఎవరి హయాంలో రోడ్లు నిర్మించారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వంపైన, డిప్యూటీ సీఎంపైన పత్రికల్లో ప్రచారం కోసం ఇష్టానుసారం విమర్శలు చేస్తే సహించబోమని ఘాటుగా హెచ్చరించారు.

దేవరాపల్లిలో నాగుపాము హల్‌చల్



నాగుపామును పట్టుకున్న వన్యప్రాణుల సంరక్షణ సమితి సభ్యుడు మూర్తి

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా పాత ఇనుప సామగ్రి దుకాణంలో శనివారం ఉదయం నాగుపాము హడలెత్తించింది. ఆరడుగులు మేర పొడవున్న విష సర్పాన్ని చూసి షాపు యజమానులు భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. వెంటనే అటవీశాఖ గార్డు కుమార్ వన్యప్రాణుల సంరక్షణ సమితి సభ్యుడు మూర్తి తెలియజేయగా, ఆయన వెంటనే అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో విడిచి పెట్టాడు.

వ్యవసాయ సిబ్బందికి క్రాప్ కటింగ్‌పై శిక్షణ




క్రాప్ కటింగ్‌పై శిక్షణ ఇస్తున్న ఏఎస్‌వో అప్పనాయుడు

రోలుగుంట: రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ స్థాయి వ్యవసాయాధికారులకు శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో ఎస్.విజయ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణలో రావికమతం మండలం ఏఎస్‌వో అప్పలనాయుడు క్రాప్ కటింగ్ ఎక్స్‌పర్మింట్స్, ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో నోటిఫైడ్ క్రాప్, పంట బీమాపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణను నర్సీపట్నం డివిజన్ ఏ.డి.ఏ, టి. శ్రీదేవి పర్యవేక్షించారు.

పాదచారునికి తీవ్ర గాయాలు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో టి.హైమావతిరావుకు శనివారం తీవ్ర గాయాలయ్యాయి. అతడు ఇక్కడ మెయిన్ రోడ్డు దాటుతుండగా స్కూల్ బస్సు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేస్తున్నామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం



కె.కోటపాడు: డి.అగ్రహారంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



రోలుగుంట: శరభవరంలో లబ్ధిదారులకు కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ వరలక్ష్మి



మాకవరపాలెం: కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ, హరిబాబు

మాడుగుల: పుట్టిన బిడ్డకు ముర్రుపాలే శ్రీరామరక్షని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఐసీడీఎస్ పీవో శ్రీదేవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆయన 30 మంది గర్భిణులకు, బాలింతలకు టీహెచ్‌ఆర్ కిట్స్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. తామరం అంగన్‌వాడీ కేంద్రం –2లో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు గొంతిన హరిబాబు పాల్గొన్నారు.

రోలుగుంట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శరభవరం, కె.నాయడు పాలెం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శరభవరంలో వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి పాల్గొని కిట్లు పంపిణీ చేశారు.

కె.కోటపాడు: డి.అగ్రహారంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ వేచలపు గున్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.వెంకటలక్ష్మి ఎల్.వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం ముత్యవమ్మ పాల్గొన్నారు.

నాతవరం: ఎం.బి.పట్నం శివారు ఎ.శరభవరం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి వెంకటరమణ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ అమరావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగజ్యోతి, విజయకుమారి, కార్యకర్త లంక లక్ష్మి పాల్గొన్నారు.

ఇది కాదా అభివృద్ధి ?

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ప్రహరీని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి పార్టీలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే గాకుండా పలు అభివృద్ధి పనులు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.35 లక్షలతో నిర్మించిన ప్రహరీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమీపించే నాటికి మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతాయన్నారు. ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో కోటి రూపాయల మేరకు సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్ర భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇది కాదా అభివృద్ధి అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో ఇంతకాలం సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం అప్పుల పాలైందని గగ్గోలు పెట్టాయని, పార్లమెంట్ సాక్షిగా ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ వివరణతో గత టీడీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం బట్టబయలైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడికాసు, ఏఎంసీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, టెలికాం కమిటీ సభ్యుడు వేచలపు ప్రకాష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పల్లా నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సబ్సిడీ కోళ్లతో ఆదాయం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



లబ్ధిదారులకు సబ్సిడీ కోళ్లను అందిస్తున్న విప్ ధర్మశ్రీ

చోడవరం రూరల్: ప్రభుత్వం సబ్సిడీపై అందించే నాటుకోళ్లను కోసుకుని తినకుండా, చక్కగా పెంచి వాటి ద్వారా ఆదాయం పొందాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తన దైన శైలిలో చమత్కరించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా గ్రూపులకు సబ్సిడీపై 11 నాటుకోళ్లు, దాణా, మందుల కిట్లను ఆయన పంపిణీ చేశారు. లబ్ధిదారులు రూ.3,900 చెల్లిస్తే మేలు జాతి రకాలైన నాటు కోళ్లను అందజేస్తున్నారన్నారు. ఇవి గుడ్లు పెద్ద సైజులో పెడతాయన్నారు. వీటిని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసి ఆదాయం పొందాలన్నారు. నాటు కోళ్లను సంరక్షించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కనకరాజు, సీసీ గోవిందమ్మ, ఎంపీపీ గాడి కాసు, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, అంకుపాలెం సర్పంచ్ నాగులాపల్లి (చందు) రాంబాబు, నాయకులు బొడ్డేడ సూర్యనారాయణ, పల్లా నర్సింగరావు, జి.అప్పారావు, ఓరుగంటి నెహ్రూ, అల్లాడ భవాని పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



కె.కోటపాడులో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సత్యంనాయుడు



అధ్యక్షుడు త్రిమూర్తులు



కార్యదర్శి రాము

మాకవరపాలెం: పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మాకవరపాలెంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండలాధ్యక్షుడిగా కె.త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శిగా కె.రాము, గౌరవాధ్యక్షుడిగా శామ్యూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శులుగా డి.నారాయణరావు, బాబ్జీరావు ఎన్నికయ్యారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా పోతల నాయుడు బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు పర్యవేక్షణలో శనివారం స్థానిక హైస్కూల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఇమంది ప్రవీణ్, గౌరవాధ్యక్షుడిగా వంటాకు శ్రీను, ఉపాధ్యక్షుడిగా గాలి సతీష్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రసాద్, మహిళా కార్యదర్శిగా భరతలక్ష్మి, బోను దేముళ్లమ్మ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దినాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఓటర్ల జాబితాల పరిశీలనలో ఉపేక్షించేదిలేదు

నర్సీపట్నం: ఓటర్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. ఆయన తన కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో ఓటర్ల సర్వేపై సమీక్ష నిర్వహించారు. నిర్ణీత గడువులోగా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాలన్నారు. సకాలంలో పూర్తి చేయకపోతే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ డీటీలు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, ప్రవాసం వంటి అంశాల పరిశీలనలో ఎటువంటి ఉపేక్షకు తావులేదని, పక్షం రోజుల్లో ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్వోలు పూర్తి చేయాల్సిందేనని చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి డి.ప్రమీలాగాంధీ స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్ వైజర్లతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాల పరిశీలనకు సంబంధించి తయారు చేసిన రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తహశీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో బి.చైతన్య, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయి పాల్గొన్నారు.

ఓటరు సర్వే వేగవంతం

కె.కోటపాడు: ఇంటింటా ఓటరు సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్వోలకు మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిత తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల బీఎల్వోలతో శనివారం కె.కోటపాడులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో ఎటువంటి అభ్యంతరాలు వచ్చినా సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలను తీసుకునేందుకు వెనుకాడబోనని హెచ్చరించారు. మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, తహసీల్దార్లు జె.రమేష్‌బాబు, ఎం.లక్ష్మి, ఎంపీడీవో కె.శచీదేవి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

వరినాట్ల యంత్రంతో సమయం, పెట్టుబడి ఆదా



మారేపల్లిలో యంత్రం ద్వారా వరినాట్లుపై అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: యంత్రం ద్వారా వరి నాట్లు వేయడంతో సమయం, పెట్టుబడి ఆదా చేసుకోవడంతో అధిక దిగుబడులు పొందవచ్చునని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. మండలంలోని తొలిసారిగా మారేపల్లిలో యంత్రం ద్వారా ఖరీఫ్ వరి నాట్లు వేయించారు. ఈ పద్ధతిపై వ్యవసాయ సహాయకులతోపాటు రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. యంత్రం ద్వారా నాలుగు వరుసలు, ఆరు వరుసల్లో రోజుకు 6 నుంచి 8 ఎకరాల్లో నాట్లు వేయొచ్చన్నారు. తద్వారా గాలి, వెలుతురు బాగా తగిలి ఎక్కువ పిలకలు వస్తాయన్నారు. పురుగు, తెగుళ్ల బెడద తగ్గి దిగుబడి బాగుంటుందని వివరించారు. ఈ ఏడాది బోయిలకింతాడలో నలుగురు రైతులు ఐదెకరాల్లోనూ, తారువలో నలుగురు రైతులు 6.5 ఎకరాల్లోనూ, మారేపల్లిలో ముగ్గురు రైతులు 4.5 ఎకరాల్లోనూ యంత్రం ద్వారా వరి నాట్లు వేయనున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరినారు చివర్లు తుంచి నాటుకోవాలి

రావికమతం: వరినారు చివర్లు తుంచి నాటుకోవాలని, దీనివల్ల ఆకుముడత పురుగును నివారించుకోవచ్చని ఏవో గుణతులసి తెలిపారు. శనివారం దొండపూడిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరినారు వేర్లు క్లోరైపీరిఫోస్లో అనే మందులో ముంచి నాటుకున్నట్లయితే 45 రోజుల వరకూ వరి పంటకు పురుగులు, తెగులు ఆశించదన్నారు. ఉప సర్పంచ్ గట్రెడ్డి రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు, వ్యవసాయ సిబ్బంది నూకరాజు, జగదీష్ పాల్గొన్నారు.